## క్లుప్తంగా

### సీజన్‌లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలి



మల్లవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విమల గిరి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమల గిరి కోరారు. మల్లవరంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో రోగాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### వైభవంగా అమ్మవారి తిరునక్షత్రం పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న పండితులు

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీ రాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి దేవస్థానంలో తిరునక్షత్రం సందర్భంగా ఆండాళ్ళు అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం నూతన వస్త్ర అలంకరణ, అర్చన బాలభాగీతం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వెంకటాద్రి పర్యవేక్షణలో పండితులు కృష్ణ స్వామి, నారాయణాచార్యులు పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

### లాలం భాస్కరరావు సేవలు చిరస్మరణీయం

మునగపాక : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ లాలం భాస్కరరావు కృషి చేశారని టీడీపీ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పెంటకోట విజయ్ అన్నారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం లాలం భాస్కరరావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ భాస్కరరావు పలు పదవులు అలంకరించి వాటికి వన్నె తెచ్చారన్నారు. భాస్కరరావు హయాంలో పలు సేవా కార్యక్రమాలతో పాటు అభివృద్ధి జరిగిందన్నారు. అలాగే జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కూడా భాస్కరరావు భార్య భవానీ బాధ్యతలు చేపట్టి అందరికీ మేలు జరిగేలా చూశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు దాడి ముసిలినాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి శివ, ఏపీఎం సత్యనారాయణ, కోరుకొండ ప్రసాద్, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థుల వితరణ



మినరల్ వాటర్ మిషన్ అందజేస్తున్న పోర్టు పాఠశాల పూర్వ విద్యార్థులు

ఎస్.రాయవరం:విశాఖపట్నం పోర్టు పాఠశాల పూర్వ విద్యార్థులు ఉప్పరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.40 వేలు విలువ చేసే సామాగ్రిని శనివారం అందజేశారు.హెల్పింగ్ హేండ్స్ సొసైటీ పేరుతో విద్యార్థులకు సహాయం అందచేస్తున్నట్టు సొసైటీ ప్రతినిధులు చక్రవర్తి, రేణుక, సుజాత, భాస్కరరావు అన్నారు. పాఠశాలకు అవసరమైన మెగా ఫోన్, మినరల్‌వాటర్ ప్లాంట్ తదితర వస్తువులు అందజేశారు కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు ,ప్రధానోపాధ్యాయుడు రాజారావు, ఉపాధ్యాయులు జాన్‌మెతుషలా పాల్గొన్నారు.

### అయ్యప్పస్వామి ఆలయంలో నేడు ప్రత్యేక పూజలు

మునగపాక : స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలు, విశేష అర్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరారు.



# సీఎం జగన్‌కు మెండుగా ప్రజల ఆశీస్సులు

- చంద్రబాబు, పవన్ ఆయన కుర్చీని కూడా తాకలేరు
- ఎమ్మెల్యే కన్నబాబురాజు



ఏఎస్‌ఆర్ కాలనీలో ప్రజలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి అల్లూరి సీతారామరాజు కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మతో కలసి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పేదవాడికి గూడు కల్పించాలనే లక్ష్యంతో జగనన్న కాలనీలు, పట్టణ పరిధిలో టిడ్కో గృహాలు నిర్మించి ఉచితంగా అందజేస్తున్నారని అన్నారు. వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారని సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందుతున్నాయని, రాష్ట్రంలో మహిళలకు అన్ని రంగాల్లో రాణించేలా వారికి జగనన్న తోడు, చేయూత పథకాలు అందిస్తున్నారని తెలిపారు. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందిస్తున్నారని, జగనన్న గోరు ముద్ద పథకంలో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. చంద్రబాబును ప్రజలు విశ్వసించలేదని పవన్ కల్యాణ్‌ను వెంటబెట్టుకొని ప్రజల్లోకి వస్తున్నాడని, అయితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అఖరికి ఇతర రాష్ట్రాల మాదిరిగా ప్రతిపక్ష నాయకుడు కూడా మేనిఫెస్టోలో జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను కాపీ కొడుతున్నాడని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దేవుడు, ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని, ఆయన కుర్చీ ఎంతో శక్తితో కూడుకున్నదని ఆ కుర్చీని ఎవరూ అంత సులభంగా తాకలేరని అన్నారు. ప్రతిపక్షనాయకుడు వయస్సు మీద పడి ఏది మాట్లాడుతున్నాడో తనకే అర్థం కావడం లేదని మరో పక్క పవన్ కల్యాణ్ సినిమాల్లో మాదిరిగా చంద్రబాబు స్క్రిప్ట్ రాసిస్తే ఆయన దానిని ఫాలో అవుతున్నాడని అన్నారు. ఎవరైనా కొత్త పార్టీ పెడితే తాను సీఎం అవ్వాలనుకుంటాడు కానీ పవన్ కల్యాణ్ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడానికి పార్టీ పెట్టాడట.. ఇదీ జనసేన పార్టీ సిద్ధాంతం అని అన్నారు. ప్రజలందరూ జగనన్న సురక్ష కార్యక్రమంలో తమకు కావాల్సిన ధ్రువ పత్రాలు పొందాలని సూచించారు. శనివారం సాయంత్రం వరకు 1340 ధ్రువపత్రాలు మంజూరు చేసినట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, స్థానిక కౌన్సిలర్లు కావ్య, డాక్టర్ త్రినాథ్, దూది నరసింహమూర్తి, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, మున్సిపల్ కమిషనర్ వీరయ్య పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

నక్కపల్లి : వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేసి, జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని నక్కపల్లి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా నియమితులైన శీరం నర్సింహమూర్తి అన్నారు. శనివారం సారిపల్లిపాలెంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ ఒక కుటుంబం లాంటిదన్నారు. నాయకుల నడుమ ఏమైనా మనస్పర్థలు ఉంటే వాటిని తొలగించి సీనియర్ నేతలందరిని కలుపుకొని మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి ఎమ్మెల్యే బాబూరావుతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆవిర్భావం నుంచి పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న సీనియర్ నాయకులందరి సహకారం తీసుకుంటానన్నారు. గ్రామస్థాయిలో పార్టీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను సీఎంగా, గొల్ల బాబూరావును ఎమ్మెల్యేగా చేసుకోవడం కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. తనను పార్టీ మండలశాఖ అధ్యక్షుడిగా నియమించడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రజలను ఓటు అడిగే హక్కు, ధైర్యం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకే ఉందన్నారు. ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను నూరుశాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గడప గడపకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అధ్యక్షుడిగా నియమితులైన నర్సింహమూర్తిని పలువురు సన్మానించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, బచ్చలరాజు, పక్కుర్తి రమణ, సర్పంచ్‌లు నాగ అప్పలరాజు, కర్రి శ్రీను, మున్సీసా, అల్లు రమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, ఎస్.గోవిందు, సింహాచలం దేవస్థానం ఆహ్వానితురాలు శేషారత్నం, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి పాల్గొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు ఐఎఫ్‌పీ పాఠాలు



గొడిచర్లలో దివ్యాంగ విద్యార్థులకు ఐఎఫ్‌పీ పద్ధతిలో బోధన చేస్తున్న దృశ్యం

నక్కపల్లి : ప్రత్యేక అవసరాల గల పిల్లలకు వారికి అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడం జరుగుతోందని గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్ తెలిపారు. శనివారం ఆమె పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు స్మార్ట్ టీవీ ద్వారా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) విధానంలో విద్యాబోధన చేశారు. టీవీలో విజువల్స్ ద్వారా బోధన చేయడం జరుగుతోందన్నారు. ఈ ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం ప్రతి జెడ్పీ ఉన్నత పాఠశాలకు స్మార్ట్‌టీవీని సరఫరా చేసిందన్నారు. మానసిక వికలాంగులు, తక్కువ దృష్టి కలిగిన వారు, మరగుజ్జువారు, వినికిడి లోపం , పార్కిన్సన్ వ్యాధి కలిగిన వారు, దీర్ఘకాలిక నరాల వ్యాధితో బాధపడేవారు, యాసిడ్ దాడి బాధితులు ఇలా 21 రకాల ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ప్రభుత్వం పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి స్మార్ట్ టీవీలు సరఫరా చేసి విద్యాబోధన చేస్తోందన్నారు. ఈ పాఠశాలలో ఇటువంటి వారికి ఈ టీవీలో ప్రత్యేకంగా రూపొందించిన విజువల్స్ ద్వారా దైనందిన కార్యక్రమాలు నేర్పిస్తూ వారిలో ఉన్న భయాన్ని పోగొట్టి పాఠశాలకు వచ్చేలా తయారు చేయడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించి తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు.

## సకాలంలో ప్రజలకు ధ్రువపత్రాలు



పూడిమడకలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న సురక్ష ద్వారా విద్యార్థులకు,ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత కాలంలోనే అందజేయడం పట్ల మంచి స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని పూడిమడకలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధ్రువీకరణ పత్రాలు అవసరమైన వారు స్థానిక సచివాలయ సిబ్బందిని, వలంటీర్లను సంప్రదిస్తే కావాల్సిన ధృవీకరణ పత్రాలకు సంబంధించిన ప్రక్రియను వారు చూసుకుంటారని తెలిపారు. 3,600 ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సర్పంచ్ చేపల సుహాసిని, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, డి. శంకర్ రావు, చేపల వెంకటరమణ, వానపల్లి శ్రీను, తహశీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## గణిత క్లబ్‌లతో విద్యార్థుల్లో అవగాహన పెంపు



'పై 'విలువ కనుగొనే పద్ధతులను వివరిస్తున్న విద్యార్థులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత శాస్త్రానికి చెందిన 'పై' (22/7) అంచనా విలువ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'పై' విలువను కనుగొనే 15 పద్ధతుల నమూనాలను తయారు చేసి విద్యార్థులు తమ సహచర విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఎ.వి.ఎస్ మూర్తి మాట్లాడుతూ పాఠశాలల్లో గణిత క్లబ్‌లను నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో అవగాహన, సామర్థ్యం పెరుగుతుందన్నారు. హెచ్‌ఎం జి.వి.కె.ఆచారి మాట్లాడుతూ స్వయంగా చేయడం ద్వారా విద్యార్థులు గణితం అభ్యసించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వి.సత్యనారాయణమూర్తి, విజయ్, సోమరాజు, విజయలక్ష్మి, సత్యవేణి,నూకరాజు, సవితలక్ష్మి పాల్గొన్నారు.

### వరి నాట్లకు జోరుగా దమ్ములు



మామిడిపల్లిలో దమ్ములు చేసి వరి నాట్లకు సిద్ధం చేసిన పొలం

దేవరాపల్లి: ఖరీఫ్ వరినాట్లు వేసేందుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. వరి నారు ఏపుగా పెరుగుతుండటంతో నీటి సదుపాయం ఉన్న చోట దమ్ముల పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు చేరిన నీటితో మరి కొందరు పొలాల్లో దమ్ములు చేస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసిన ట్రాక్టర్‌తో చేస్తున్న దమ్ములు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం పల్లపు ప్రాంత గ్రామాలైన వేచలం, మామిడిపల్లి, ఎం.అలమండ, ఎస్.జి. నగరం, కొత్తపెంట, బోయిలకింతాడ, కలిగొట్ల గ్రామాల్లో దమ్ములు ముమ్మరంగా సాగుతున్నాయి.

### నారు ఆరోగ్యకరంగా పెంచాలి

రాంబిల్లి : వరి నారు ఆరోగ్యకరంగా పెంచేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని ఏవో సి.సుమంత సూచించారు. నారు ఆరోగ్యకరంగా వుంటే నాట్లు వేశాక కూడా ఆరోగ్యకరంగా పెరుగుతుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది సూచనల మేరకు రసాయన మందులు పిచికారి చేయాలన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాంబిల్లి : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా వుండాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరును తాగాలన్నారు. అలాగే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా ఉండవచ్చునన్నారు.

### జగనన్న సురక్షతో ముంగిట్లో సేవలు

మునగపాక : ప్రజా రంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించాలని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పిలుపునిచ్చారు. అరబుపాలెం, ఒంపోలు సచివాలయాల్లో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ ఇంటికే సేవలు అందుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవడం ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు పొందవచ్చన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సర్పంచ్‌లు బొడ్డేడ శ్రీనివాసరావు, సూరిబాబు, ఎంపీటీసీ బుజ్జి, పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, శ్రీరామమూర్తి, ద్వారం జానకీరాం, తుట్టా వెంకటప్పారావు, రామునాయుడు, అర్జునరావు, దొడ్డి చిన్న, వెంకటప్పారావు, డీఎల్‌డీవో మంజులావాణి, తహసీల్దార్ ప్రకాశరావు పాల్గొన్నారు.

### 27న 'కొబ్బరిచెక్కల' వేలంపాట

అనకాపల్లిటౌన్: దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని గవరపాలెం సంతోషిమాత ఆలయంలో కొబ్బరి చెక్కల కోసం ఈనెల 27వ తేదీ ఉదయం 10గంటలకు టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకూ కొబ్బరి చెక్కలు పోగు చేసుకునేందుకు లైసెన్సు హక్కు కోసం వేలంపాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పాటలో పాల్గొన దలచిన వారు ప్రధమ ధరావత్తుగా రూ.5వేలు చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9296350731 అనే ఫోన్ నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

### 60 మందికి వైద్య పరీక్షలు

మాడుగుల రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా కె.జె.పురం, కింతలి పీహెచ్‌సీల పరిధిలోని గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం తాటిపర్తి ఆరోగ్య ఉప కేంద్రం పరిధి శంకరం పంచాయతీ శివారు కృష్ణంపాలెంలో కె.జె.పురం పీహెచ్‌సీ డాక్టరు ఎల్ శివప్రసాద్‌పాత్రుడు 60 మంది రోగులను పరీక్షించారు. వీరిలో 13 మంది బీపీ, 11 మంది సుగర్ వ్యాధిగ్రస్తులను, ముగ్గురు దీర్ఘకాలిక రోగులు ఉన్నారు. అంగన్‌వాడీ, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులను పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

## ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను అన్నారు. స్థానిక మొయిన్‌రోడ్డు తహసీల్దార్ కార్యాలయం రహదారిలో కశింకోట, కూంద్రం, కుంచంగి, బయ్యవరాలకు చెందిన ఆటో డ్రైవర్లకు శనివారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలను రోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, అధిక లోడ్‌తో ప్రయాణం చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. డ్రైవర్లు తప్పని సరిగా యూనిఫాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రికార్డుల తమ వెంట ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఆటోలో అనుమానిత వ్యక్తులు ఎవరైన ప్రయాణిస్తే తక్షణమే దగ్గరలోఉన్నపోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్ పాల్గొన్నారు.

## సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై చర్యలు తీసుకోండి

- మండల సమావేశంలో అధికారులకు ఎంపీపీ ఆదేశం



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

నక్కపల్లి : మండల సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం ఆదేశించారు. శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా పౌరసరఫరాలు, సర్వే శాఖల సిబ్బంది పనితీరు చాలా అధ్వానంగా ఉందన్నారు. అనధికార వ్యక్తుల హవా ఈ కార్యాలయాల్లో ఎక్కువగా ఉందని ఆరోపించారు. గృహ నిర్మాణశాఖ బిల్లు చెల్లింపులు, గ్రామాల్లో డ్రెయినేజీ సమస్యలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, రెవెన్యూ పరమైన సమస్యలు, సర్వే సమస్యలను ప్రస్తావించారు. గత సమావేశంలో కూడా ఇవే సమస్యలు లేవనెత్తినప్పటికీ పరిష్కరించడం లేదని సభ్యులు ఆకేటి గోవిందరావు, కుంచా మధు, మేరుగ నాగేశ్వరరావు తదితరులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై తీసుకున్న చర్యల గురించి ప్రస్తావించారు. ఐకేపీ ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ వారు ఇస్తున్న సబ్సిడీ రుణాల విషయం ప్రజలకు తెలియడం లేదని పలువురు సభ్యులు ఆరోపించారు. పేదలు స్వయం ఉపాధి కార్యక్రమాల కోసం ప్రభుత్వం అందించే ఈ రుణాలను కొంతమంది డ్వాక్రా సిబ్బంది గ్రామాల్లో తెలియజేయాలని కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలు సూచనలు పాటించాలని ఏవో ఉమాప్రసాద్ కోరారు. ఉద్దండపురం సర్పంచ్ వెంకటేష్ మాట్లాడుతూ జీఎస్‌టీ చెల్లించేవారి రేషన్ కార్డులు మూడేళ్ల క్రితం రద్దు చేశారన్నారు. దానికి సంబంధించిన పత్రాలు తెస్తే కార్డులు పునరుద్ధరిస్తామన్నారని, సీఎస్‌డీటీ అందుబాటులో లేకపోవడం వల్ల ఈ సమస్య పరిష్కారం కాలేదన్నారు. పాఠశాల సమయంలో బడి బస్సు నడపాలని ఆర్‌టీసీ వారికి లేఖ రాయాలని కోరారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ మాట్లాడుతూ సీఎస్‌డీటీ పనితీరు అధ్వానంగా ఉందని, ఆయన కార్యాలయంలో సురేష్ అనే అనధికార వ్యక్తితో పనులు చేయిస్తున్నారని, దీనిపై జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనధికార వ్యక్తుల వల్ల అక్రమాలు జరుగుతున్నాయన్నారు. మామూళ్లు ఇస్తేనే పనులు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, డీటీ నీరజ, సూపరింటెండెంట్ సీతారామరాజు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- ఈదటంలో గడపగడపకు మన ప్రభుత్వం
- హైస్కూలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఈదటంలో హై స్కూల్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని, కోట్లాది రూపాయలు విద్యారంగానికి ఖర్చు చేస్తున్నారని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. ఈదటం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో నాడు–నేడు ద్వారా పాఠశాల అభివృద్ధి, పాఠశాలల్లో అదనపు తరగతులు, పాఠశాల కాంపౌండు వాల్ నిర్మాణానికి మంజూరైన కోటి రెండు లక్షల రూపాయలతో చేపడుతున్న పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించి జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద కార్యక్రమాల అమలుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు ఏవిధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని, తాగునీరు సమస్య పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం సంక్షేమ పథకాల బ్రోచర్లను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, పాయకరావుపేట పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, ఈదటం, పాల్మన్‌పేట, ఎంఎస్‌పేట, కేశవరం గ్రామాల సర్పంచ్‌లు పిర్ల వెంకటరమణ, కోడ కోటేశ్వరరావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాస్, మేడిశెట్టి రామగోవిందు, ఎంపీటీసీలు గణసాల పద్మావతి, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వై.అన్నవరం, పార్టీ నాయకులు సూర్యచక్రం, పల్లేల కృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా గోదాదేవికి ప్రత్యేక పూజలు



గోదాదేవి సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో గోదాదేవి అమ్మవారి తిరు నక్షత్ర కార్యక్రమం శనివారం నేత్ర పర్వంగా జరిగింది. ఉదయం మూలవిరాట్‌కు అర్చకులు కృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకం తీర్థగోష్టి, ప్రసాద నివేదన నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, స్వామివారి ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చకులు వేంకట శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, బాగవతం గోపాలాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు అలంకరణ చేసి నావారా దివ్యప్రబంధం సేవాకాలము నిర్వహించారు. కుంకుమార్చన విశేష పూజలు నివేదనలు, తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం జరిగింది. అనంతరం వెయ్యిమందికి అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో సిబ్బంది గురవయ్య మహేష్ ,హెటిరో ప్రతినిధి సీతారామాచార్యులు పాల్గొన్నారు.

## కోలాటాన్ని ప్రభుత్వం గుర్తించాలి



కోలాటం మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న కాంద్రేగుల వెంకటరమణ, మహేశ్వరరావు

తుమ్మపాల: సంప్రదాయ, సాముహిక ఆట కోలాటం ప్రదర్శనలను గుర్తించాలని ప్రభుత్వానికి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాంద్రేగుల వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. స్థానిక గవరపాలెంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహించిన యువ ఉత్సవ్–2023లో కోలాటం ప్రదర్శించిన మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోల, ఆట అనే రెండు పదాల కలయిక కోలాటం అని, కోలాటం అనేది బృందగానంతో కూడిన లలితమైన బృంద నృత్యమన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు,శ్రీగౌరీ పరమేశ్వరీ అమృత వర్షిణి అధ్యక్షుడు పెతకంశెట్టి లక్ష్మీనారాయణ,కార్యదర్శి సుజాత, పలు కోలాటం గ్రూపుల మహిళలు పాల్గొన్నారు.

## ఎంపీ కోటా నిధులతో సిమెంట్ రోడ్లు

కశింకోట: స్థానిక ఎస్సీ ప్రాంతాల్లో ఎంపీ కోటా నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మించనున్నట్టు అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకటసత్యవతి తెలిపారు. స్థానిక హౌసింగ్ కాలనీ, ఇందిరా కాలనీ ప్రాంతాల్లో రోడ్లు నిర్మించనున్న ప్రాంతాలను శనివారం పరిశీలించారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.